ఆర్బీకేలతో రైతు గడప వద్దకే సేవలు

రైతులకు తప్పిన వ్యయప్రయాసలు

నూజివీడు: ఆరుగాలం స్వేదం చిందించి పంటలు పండించే రైతన్నకు అన్ని కాలాల్లో అడుగడుగునా కష్టాలే. నారు పోసి, నాట్లు వేసి, పంట పండించి, మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మే వరకు రైతుకు క్షణక్షణం కష్టాల బాటే. వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలలో ఇరుక్కుని.. అప్పిచ్చినవాడికే అయినకాడికి అమ్ముకునే దుస్థితి. ఇదంతా ఒకప్పటి పరిస్థితి.

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక రైతులు స్థితిగతులు ఒక్కసారిగా మారిపోయాయి. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టడమే కాకుండా అమలు చేసి చూపిస్తూ వ్యవసాయాన్ని పండగగా మార్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతులకు అండగా నిలిచింది. గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ను ఏర్పాటు చేసి వ్యవసాయ, ఉద్యాన సహాయకులను నియమించి ప్రభుత్వం వ్యవసాయ సేవలను రైతుల గడప వద్దకు తీసుకొచ్చింది. దీంతో వ్యవసాయశాఖ ద్వారా క్షేత్రస్థాయిలో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.





నూజివీడు మండలం తుక్కులూరులోని రైతు భరోసా కేంద్రం

రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు

ప్రభుత్వం, రైతులకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం అందజేస్తున్న సేవలన్నీ రైతుల చెంతకే వెళ్లేందుకు గాను గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించడం, ధాన్యాన్ని కొనుగోలు చేయడం వంటివన్నీ ఈ రైతు భరోసా కేంద్రాల్లోనే నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా గోడౌన్లు, కోల్డ్‌స్టోరేజీలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతేగాకుండా ప్రాథమిక స్థాయి లో ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. నూజివీడు నియోజకవర్గంలో ప్రస్తుతం 92 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలను అందజేస్తోంది. వీటన్నింటికీ తోడు వందలాది మంది వ్యవసాయ సహాయకులను, ఉద్యాన సహాయకులను, సెరీకల్చర్ సహాయకులను, పశుసంవర్ధక సహాయకులను నియమించి రైతులకు అవసరమైన సేవలను అందిస్తోంది. వీరు పంటల సాగులో, తెగుళ్ల విషయంలోను సకాలంలో సలహాలు, సూచనలు అందిస్తూ రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకు ఎంత చేసినా తక్కువేననే సానుకూల దృక్పథంతో ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ప్రతి విషయంలోనూ చేదోడు వాదోడుగా ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాయి. అంతేగాకుండా ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం కియోస్కో మిషన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం ఇండెంట్ పెట్టుకుంటే రెండు రోజుల్లో రైతులకు అందుతాయి. వీటన్నింటికి తోడు గ్రామస్థాయిలోనే ఉంటే ఉద్యాన, వ్యవసాయ సహాయకులు ప్రతి సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలను వెంటనే ఈ క్రాప్ బుకింగ్ చేస్తుండటంతో ఎప్పుడైనా తుపానుల వల్ల పంట నష్టం జరిగితే ప్రభుత్వం అదే సీజన్‌లో నష్టపరిహారాన్ని అందజేస్తోంది. గతంలో 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రానికి రైతులు చెప్పులరిగేలా తిరిగేవారు. రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో ఇప్పుడు రైతులు తమ ఇంటి వద్దే ఉండి అన్ని రకాల సేవలను పొందుతున్నారు.



తిరువూరు మండలం ముష్టికుంట్ల ఆర్బీకేలో నిల్వచేసిన ఎరువులు

10 వేల మందికి ప్రయోజనం

తిరువూరు: తిరువూరు మండలంలో 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా 10వేల మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు.

భూసార పరీక్షలూ అక్కడే..

పంటలు సాగు చేయడానికి ముందు భూసారాన్ని పరీక్షించి తదనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునే విధానంతో రైతులకు ప్రయోజనకరంగా ఉండటంతో గ్రామస్థాయిలోనే మట్టి నమూనాలను సేకరించి తీసుకువస్తే వారం రోజుల్లో ఫలితాలను రైతుకు అందిస్తున్నారు. తిరువూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌కు 1,208 మట్టినమూనాలు సేకరించడం లక్ష్యంగా వ్యవసాయశాఖ నిర్ణయించింది.

తొలివిడత 1,795 టన్నుల నిల్వ

రైతు భరోసా కేంద్రాల్లోనే ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఏపీ సీడ్స్ సరఫరా చేసే సబ్సిడీ వరి విత్తనాలను బీపీటీ 5204, ఎంటీయూ 1061 రకాలు ఆర్బీకేలలో అందుబాటులో ఉంచారు. యూరియా, కాంప్లెక్సు ఎరువులు, డీఏపీ, పొటాష్, ఎంఓపీ ఎరువులను కూడా మండలంలో అవసరాలకనుగుణంగా తొలివిడత 1,795 టన్నులను నిల్వ చేశారు. గోదాములు ఉన్న ముష్టికుంట్ల, వావిలాల, గానుగపాడు, రోలుపడి గ్రామాల్లో రైతులకు నేరుగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను సరఫరా చేస్తుండగా, మిగిలిన గ్రామాల్లో తాత్కాలిక గోదాములు ఏర్పాటు చేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



గతంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఎక్కడకు వెళ్లాల్సిన అవసరం లేదు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోనే విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు తదితరవన్నీ లభిస్తున్నాయి. రైతులకు అవసరమైన సేవలన్నీ రైతుభరోసా కేంద్రాల్లోనే లభిస్తున్నాయి.

– పల్నాటి రఘు, దేవరగుంట, నూజివీడు మండలం

వ్యవసాయ రంగంలో విప్లవం



రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత రైతులకు ప్రభుత్వ పరంగా వ్యవసాయ శాఖ సేవలు చేరువయ్యాయి. ఒకరకంగా వ్యవసాయ రంగంలో ఆర్బీకేలు విప్లవం. ప్రతి సేవను రైతుల గడప వద్దకు వెళ్లి అందిస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు, పురుగు మందులు, ఈ–క్రాప్ బుకింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు తదితర అన్ని రకాల సేవలను అందిస్తున్నాం.

– విద్యాసాగర్, ఏడీఏ, నూజివీడు

నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది



రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. నాలుగేళ్లుగా రైతు భరోసా పథకంలో ప్రతి ఏటా నగదును ఖరీఫ్ సీజన్‌కు ముందు బ్యాంకు ఖాతాకు జమ చేస్తోంది. విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని లేకుండా ఉంటోంది.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు, నూజివీడు మండలం

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోంది. దీంతో వ్యాపారుల వద్దకు వెళ్లకుండానే గ్రామంలోనే నాణ్యమైనవి లభ్యమవుతున్నాయి. ఆర్బీకేల్లో లభ్యమవుతుండడంతో షాపుల యజమానులు కూడా ఎరువుల ధరలను ఇష్టం వచ్చిన ధరకు అమ్మడం నిలిచిపోయింది.

– పల్లే రవీంద్రరెడ్డి, నూజివీడు

సేవలు సంతృప్తికరంగా ఉన్నాయి



రైతుభరోసా కేంద్రాల్లో సేవలు సంతృప్తికరంగా ఉన్నాయి. వ్యవసాయ సిబ్బంది భూసార పరీక్షలు చేయడంతో పాటు రైతు భరోసా పథకానికి పేర్ల నమోదు చేయడం, ఈక్రాప్ చేయడానికి అందుబాటులో ఉంటున్నారు. వరి దిగుబడుల విక్రయాలకు కూడా ఆర్బీకేలలోనే ఏర్పాట్లు చేయడంతో సౌకర్యవంతంగా ఉంది.

– కానుకుంట్ల నిత్యానందం, రోలుపడి, తిరువూరు మండలం

గతంలో మండల కేంద్రానికి వెళ్లేది



గతంలో సబ్సిడీ విత్తనాలకు, ఎరువులు, పురుగుమందుల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో అన్ని సేవలూ అందుబాటులోకి వచ్చాయి. మాకు వ్యయప్రయాసలు తప్పాయి.

– పానెం బేబీ, రోలుపడి, తిరువూరు మండలం

భూసారపరీక్షలపై అవగాహన

గ్రామస్థాయిలో రైతుల అవసరాల మేరకు రైతు భరోసా కేంద్రాలు సేవలందిస్తున్నాయి. పంటల సాగులో మెలకువలను తెలియజేసేందుకు పొలంబడి నిర్వహణ, పంట మార్పిడి, భూసారపరీక్షలపై అవగాహన కల్పించడానికి ఆర్బీకేలు అందుబాటులో ఉన్నాయి.

– పద్మ, మండల వ్యవసాయాధికారి, తిరువూరు

క్లుప్తంగా

ప్రత్యేక వైద్యశిబిరం



తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరు నాగార్జున స్కూలు ఆవరణలో మధుమేహరోగుల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 1,150 మంది రోగులకు ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేసినట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ వల్లభనేని రవీంద్ర తెలిపారు. రక్తపోటు, మూర్ఛవ్యాధి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వైద్యులు సత్యతేజ, లక్ష్మణరావు, కృపారాణి, నేతాజీ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులు పాపారావు, హరికృష్ణ పర్యవేక్షించారు. గుళ్లపల్లి ఫౌండేషన్, శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల వలంటీర్లు సేవలందించారు.

దమ్మునార్లు ప్రారంభం



చాట్రాయి: ఖరీఫ్ సాగుకు రైతులు శ్రీకారం చుడుతున్నారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఇందులో భాగంగా ముందస్తుగా వ్యవసాయ బోర్లు సదుపాయం ఉన్న రైతులు దమ్ము నార్లు పోశారు. కొంతమంది సొడి నార్లు పోశారు. నైరుతి రుతు పవనాలు సకాలంలో వస్తే పోసిన పొడి నార్లు మొలకెత్తేవి. కాగా వాతావరణం కొద్దిగా చల్లబడి చిన్నపాటి వర్షాలు పడుతుండడంతో పొడి నార్లు కూడా మొలకెత్తే అవకాశం ఉంది. దీనికి తోడు ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తుండటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.

నేడు ప్రజా వేదిక

నూజివీడు: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ పూర్తయినందున, దీనిపై సోమవారం ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ సోమేశ్వరి తెలిపారు. అలాగే సామాజిక భద్రత పింఛన్లు, ఆమ్‌ఆద్మీ బీమా స్కాలర్‌షిప్‌లపైన సైతం సామాజిక తనిఖీ ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న ప్రజావేదిక కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీనాట్య కళానికేతన్ బృందానికి చెందిన నృత్యకారులు పలు కీర్తనలకు భరతనాట్యం ప్రదర్శించారు. అనంతరం వారు దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

అంకమ్మ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మ శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

యోగాతో ఆహ్లాదం.. ఆరోగ్యం..

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానసిక ఆహ్లాదం, శారీరక ఆరోగ్యానికి యోగా తోడ్పడుతుందని ఫెర్టికేర్ ఐవీఎఫ్ సెంటర్ ఆపరేషన్స్ ఏజీఎం అనూష అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఆ సంస్థలో యోగా జుంబా ఈవెంట్ నిర్వహించారు. ఉమెన్స్ డెంటల్ కౌన్సిల్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్టల్ ఏపీ బ్రాంచ్‌లతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనూష మాట్లాడుతూ మానసిక వత్తిడిని అధిగమించి జీవితంలో విజయం సాధించడానికి యోగా, జుంబా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యూష, రామ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆశీస్సులతో అన్నదానం

ఏ.కొండూరు: ఆకలిగా ఉన్న వారికి అన్నం పెట్టి ఆదరించే సూఫీ మహనీయులు హుజూర్ హజరత్ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా దీవెనలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏఏబీఎస్‌టీఏ దర్బార్ నిర్వాహకులు అతా మొహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరి పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చీమలపాడులో వేంచేసియున్న హుజూర్ హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దర్గాను ప్రతిసారి దర్శించుకుంటూ మేళ తాళాలతో చాదర్, పూలు, గంధం, సమర్పించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. జంపని గ్రామంలోని దర్బార్‌లో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని మహాదివ్య అన్న సమారాధన ప్రసాదాన్ని స్వీకరిస్తుంటారని పేర్కొన్నారు.



ప్రసాదాన్ని అందిస్తున్న అతా మొహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరి

ఎంఈఓ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలి

రెడ్డిగూడెం: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలానికి అదనపు ఉపాధ్యాయ పోస్టులను తీసుకురావడంలో ఎంఈఓ పి.రఘురామ్ పూర్తి అశ్రద్ధగా వ్యవహరించారని తద్వారా అవసరమున్న పాఠశాలలో కూడా ఉపాధ్యాయ పోస్టులను కోల్పోయినట్లు ఎస్టీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్, మండల అధ్యక్షుడు బి.అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే ప్రక్రియలో ఒక్క రెడ్డిగూడెం మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో కూడా సుమారు పదికి పైగా ప్రతి మండలానికి ఉపాధ్యాయ పోస్టులు అదనంగా కేటాయించారని పేర్కొన్నారు. మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాల లు అధికంగా ఉండి డిప్యుటేషన్‌లకు ఇబ్బంది ఉన్నప్పటికీ సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలు ఉన్నప్పటికీ కూడా అదనపు ఉపాధ్యాయుల కేటాయింపు జరగలేదని ప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల డీటీఎఫ్, వైఎస్ఆర్ టీఎఫ్, ఆర్‌టీయూ సంఘాలతో కలిపి డీఈఓ రేణుకకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

నూజివీడు: మండలంలోని సీతారామపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద నుంచి రూ.3,800ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మండల పరిధిలో పేకాట, కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారి సంబరం నిర్వహించామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. బ్రాహ్మణ వీధిలో దేవస్థాన పరిపాలన భవనం ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద దేవతా మూర్తులకు చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూలు, పండ్లు, పూజా సామగ్రి, పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసులు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, తొత్తడి వేదకుమారి, అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.



అమ్మవారికి పూజా సామగ్రిని తీసుకెళ్తున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు

అమర గాయకులకు స్వరనీరాజనం

విజయవాడ కల్చరల్: సునీల్ ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకులకు స్వరనీరాజనం, ఫాదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం ఆలపించిన గీతాలను గాయకుడు సునీల్ ఆధ్వర్యంలో పలువురు గాయనీగాయకులు చిత్ర గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన మారేపల్లి జోషి, జ్ఞానకిషోర్, డేవిడ్‌రాజు, ప్రవాసాంధ్ర గాయని సింధు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకునిగా విశిష్టసేవలను అందించిన సునీల్‌కు అమెరికాకు చెందిన ప్రైవేట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భం పురస్కరించుకుని సంస్థ నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

● స్వరరాగార్చన ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా ఫాదర్స్ డే

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఫాదర్స్ డే వేడుకలు కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్, పాస్టర్ మోగులూరి ఎలీషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేక్ కట్‌చేసి జన్మనిచ్చిన తండ్రి కి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ నాయకులు ఎం. అబ్రహాం, గ్రేస్ మినిస్ట్రీస్ పెద్దలు యో బు, మాణిక్యాలరావు, ప్రభుదాస్ పాల్గొన్నారు



కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలో ఫాదర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పాస్టర్ ఎలీషా

జీవితానికి బంగారు బాట వేసేది తండ్రి

మైలవరం: ప్రతి ఒక్కరి తండ్రి ప్రపంచంలోనే అత్యుత్తమ తొలి ఉపాధ్యాయుడు అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం తెలిపారు. తండ్రి జీవితంలోని ప్రతి సమస్యను ఎదుర్కొనే మేధస్సును, ధైర్యాన్ని, శక్తిని ఇస్తారని ఇపేర్కొన్నారు. నాన్న మాటల్లో ఎంత ప్రేమ ఉందో.. ఆయన కోపంలో కూడా అంతే బాధ్యత ఉంటుందని తెలిపారు. మనలోని లోపాలను సరిచేస్తూ, మన భవిష్యత్‌కు పునాదులు వేస్తూ, మన జీవితానికి బంగారు బాట వేసేది నాన్నే అని పేర్కొన్నారు.

మూడు నెలలకోసారి రక్తదానం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత చెప్పారు. సీఐటీయూ ఉద్యమ నేత పర్సా సత్యనారాయణ శత జయంతి సందర్భంగా సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ రంజిత మాట్లాడుతూ రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాల రక్షణకే కాదు, రక్తదాతల ఆరోగ్యానికి కూడా మంచిదని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవల్లోనూ సంఘం ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 23 మంది రక్తదానం చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు క్రీడాపాఠశాల ప్రవేశానికి ఎంపికలు

విస్సన్నపేట: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందగోరు విద్యార్థులకు మండల స్థాయిలో సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. 4,5 తరగతులు చదివే ఆసక్తిగల బాల బాలికలు హైస్కూల్లో జరిగే స్కిల్‌టెస్టు ఎంపికలకు తమ పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని పాఠశాల పీడీ, నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి ఎం.రమేష్ తెలిపారు. వివరాలకు 91778 67889లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: కడప క్రీడాపాఠశాలలో చేరడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు సోమవారం తిరువూరులో జరిగే ఎంపిక ప్రక్రియకు హాజరవ్వాలని ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటలకు 4, 5 తరగతుల విద్యార్థులు ఈ ఎంపికకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

తిరువూరు ఎంఈఓ-2గా రామకృష్ణ

తిరువూరు: మండల విద్యాశాఖాధికారి–2గా విస్సన్నపేట ఎంఈఓ చదల రామకృష్ణ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం తిరువూరు మండల ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈఎల్‌సీ కేశవరావు ఎ-కొండూరు ఎంఈఓ–2గా, మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సుధాకర్ విస్సన్నపేట ఎంఈఓ–2గా నియమితులయ్యారు.

చాట్రాయి ఎంఈఓ–2గా బ్రహ్మచారి

చాట్రాయి: మండల విద్యాశాఖాధికారి–2గా వజ్రాల బ్రహ్మచారి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి హైస్కూలు నుంచి చాట్రాయి హైస్కూలుకు హెచ్ఎంగా వచ్చారు

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

విస్సన్నపేట: స్థానిక భగవాన్ సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి ధ్యాన మందిరంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి ఆదివారం తెలిపారు. నూజివీడు గిఫ ర్డు మెమోరియల్ ఆస్పత్రి వైద్యుడు జెమ్మద్ షాహీ న్ సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారికి నూజివీడు ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.